మనం
కడప | అన్నమయ్య

## తెదేపా నేతలకు వివాహ ఆహ్వానం

మనం న్యూస్ రాజంపేట సెప్టెంబర్ 29: సుండుపల్లి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు చప్పిడి రమేశ్ నాయుడులను మంగళవారం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కువైట్ ఏపీ తెదేపా యూత్ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్‌ఖాన్, ఎన్నారై తెదేపా ప్రతినిధులు కంచన రెడ్డయ్య, కంచన రెడ్డిశేఖర్, యువ నాయకులు దర్బార్‌ఖాన్, షాహిద్ తదితరులు నేతలను కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం తమ కుటుంబ వివాహ వేడుకకు హాజరుకావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నేతలు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.
















# సేవకు దక్కిన కిరీటం: డాక్టర్ కొండూరు శరత్ కుమార్‌రాజుకు డాక్టరేట్ ప్రదానం

**నిస్వార్థ సేవాతత్పరతకు నిలువెత్తు నిదర్శనం..**
**రాజంపేటలో అపూర్వ సత్కారం**
**ముప్పై ఏళ్ల తపస్సుకు మహోన్నత గుర్తింపు**

మనం ప్రతినిధి రాజంపేట సెప్టెంబర్ 29

రాజంపేట: నిస్వార్థ సమాజ సేవకు నిలువెత్తు రూపమైన న్యాయవాది కొండూరు శరత్ కుమార్ రాజుకు దక్కిన గౌరవ డాక్టరేట్, ఆయన సేవా ప్రస్థానానికి దక్కిన అసలైన కిరీటమని పలువురు ప్రముఖులు కొనియాడారు. వాకర్స్ ఇంటర్నేషనల్ వేదికగా జాతీయ స్థాయిలో న్యాయ, సామాజిక రంగాల్లో విశేష కృషి చేసినందుకు గాను.. కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన ఢిల్లీ సాహిత్య సేవా అవార్డు కౌన్సిల్ ఆయనకు ఈ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. స్థానిక ఏబీసీ గార్డెన్‌లో వివిధ రంగాల ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు, మేధావులు, అభిమానుల మధ్య ఆత్మీయ సత్కార సభ కోలాహలంగా సాగింది. గత మూడు దశాబ్దాలుగా శరత్ కుమార్ అందించిన నిరంతర సేవలకు దక్కిన ఈ అంతర్జాతీయ పురస్కారం రాజంపేట కీర్తి కిరీటంలో మరో మణిపూస అని, యావత్ ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణమని ప్రముఖులు దిన్నెపాడు రవిరాజు కొనియాడారు.

**రాజకీయాల్లోకి వస్తే రాజంపేట రూపురేఖలే మారతాయి: అఖిలపక్ష నేతల పిలుపు**

ఈ గౌరవం శరత్ కుమార్ సేవా భావానికి నిదర్శనమని టీడీపీ రాజంపేట ఇన్‌చార్జ్ చామర్తి జగన్మోహన్ రాజు ప్రశంసించారు. శరత్ కుమార్ రాజు వంటి సేవాతత్పరులు రాజకీయ రంగ ప్రవేశం చేస్తే ప్రజాసేవ మరింత విస్తృతంగా సాగుతుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు ఆకాంక్షించారు. తండ్రి కొండూరు రామరాజు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుంటూనే విద్యా, న్యాయ రంగాల్లో సేవా పరంపరను కొనసాగించాలని జనసేన పార్లమెంట్ ఇన్‌చార్జ్ ఎల్లటూరి శ్రీనివాస్ రాజు సూచించారు. శరత్ కుమార్ క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెడితే రాజంపేట చరిత్రే తిరగరాస్తారని, ఆధ్యాత్మిక రంగంలోనూ



తనదైన ముద్ర వేయాలని శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు అభిలషించారు.

**ఈ కీర్తి కిరీటం రాజంపేట పౌర సమాజానికే అంకితం: శరత్ కుమార్ రాజు**

సన్మాన గ్రహీత డాక్టర్ కొండూరు శరత్ కుమార్ రాజు మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. తల్లిదండ్రుల ఆశీస్సులు, భగవంతుని దయ, రాజంపేట ప్రజలు తనపై చూపిన అపారమైన ప్రేమాభిమానాలే తనను ఈ స్థాయికి చేర్చాయని వినమ్రంగా ప్రకటించారు. ఈ డాక్టరేట్ గౌరవం వ్యక్తిగతంగా తనకు మాత్రమే పరిమితం కాదని, రాజంపేట పౌర సమాజానికే ఈ పురస్కారాన్ని సవినయంగా అంకితమిస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, వాణిజ్య, విద్యా సంస్థల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని శరత్ కుమార్‌ను అభినందనల వెల్లువతో ముంచెత్తారు.








# జెండా మోసిన జనసైనికుడికే పట్టం

## స్థానిక పోరులో కార్యకర్తలకు జనసేన కొండంత అండ

**రాజంపేటలో నూతనోత్సాహం నింపిన పరిశీలకుడు, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటన**
**యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ నాయకత్వ పటిమపై ప్రశంసల జల్లు**
**నాయకుల సమన్వయం.. శ్రేణుల్లో కదనోత్సాహం: స్థానిక సంస్థల్లో విజయమే ఏకైక లక్ష్యం**

మనం ప్రతినిధి రాజంపేట, సెప్టెంబర్ 28: పార్టీ కోసం చెమటోడ్చిన ప్రతి కార్యకర్త శ్రమకు తగిన గుర్తింపు లభించే సమయం ఆసన్నమైంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని వైఎస్సార్ కడప జిల్లా రాజంపేటలో జనసేన పార్టీ తన క్షేత్రస్థాయి బలాన్ని ఘనంగా చాటుకుంది. అధిష్ఠానం ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నియోజకవర్గంలో పర్యటించి, కష్టపడే ప్రతి జనసైనికుడికి పార్టీ ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందన్న బలమైన భరోసానిచ్చారు.

**ఘన స్వాగతం.. నాయకత్వ ప్రతిభకు నిదర్శనం**

రాజంపేటకు విచ్చేసిన ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు నియోజకవర్గ ముఖ్య నేతలు యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ తమ తమ కార్యాలయాల వద్ద కార్యకర్తలతో కలిసి అపూర్వ రీతిలో ఘన స్వాగతం పలికారు. రాజంపేటలో జనసేనను అగ్రపథాన నిలిపేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ చూపిన చొరవ, నిబద్ధత, కార్యకర్తలను ఐక్యంగా నడిపిస్తున్న నాయకత్వ తీరును ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం నిరంతరం ప్రజా పోరాటాలు చేస్తూ, కేడర్‌కు కొండంత అండగా నిలుస్తున్న వీరిద్దరి నాయకత్వ పటిమపై సమావేశంలో ప్రశంసల జల్లు కురిసింది.

**తోట కల్యాణ మండపంలో కార్యకర్తల ఆత్మీయ మంథనం**

తోట కల్యాణ మండపంలో నిర్వహించిన విస్తృత స్థాయి సమీక్షా సమావేశం కేవలం రాజకీయ వ్యూహాల చర్చకే పరిమితం కాకుండా, కార్యకర్తల మనోభావాలను తెలుసుకునే ఆత్మీయ వేదికగా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ జెండాను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న జనసైనికుల అభిప్రాయాలను నేరుగా సేకరించారు. గ్రామ, మండల స్థాయిల్లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, గెలుపు అవకాశాలు, స్థానిక సమీకరణాలపై లోతుగా చర్చించారు.

**కష్టపడే జనసైనికులకే ఎన్నికల్లో ప్రాధాన్యం: ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ భరోసా**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ



**క్షేత్రస్థాయి శ్రేణుల్లో సంపూర్ణ ఆత్మవిశ్వాసాన్ని నింపారు:** కష్టకాలంలో నిస్వార్థంగా పార్టీ జెండాను భుజాన మోసిన నిజమైన జనసైనికులు, వీరమహిళల శ్రమకు తగిన గుర్తింపు దక్కుతుంది.

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి సముచిత స్థానం కల్పించి ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దడమే పార్టీ ధ్యేయం.**

యల్లటూరు శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ వంటి స్థానిక నాయకుల సమన్వయంతో రాజంపేట నియోజకవర్గంలో జనసేన బలమైన శక్తిగా ఎదిగింది. పార్టీ పటిష్టంగా ఉన్న ప్రతి గ్రామంలో, ప్రతి వార్డులో సమర్థులైన స్థానిక కార్యకర్తలను బరిలోకి దించి విజయఢంకా మోగిస్తాం. గ్రామ, మండల స్థాయిల్లో కార్యకర్తల అభిప్రాయాలే గీటురాయిగా అభ్యర్థుల ఎంపిక అత్యంత పారదర్శకంగా జరుగుతుంది.

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటన, స్థానిక నాయకుల సమన్వయంతో రాజంపేట జనసేన శ్రేణుల్లో సరికొత్త జోష్ వెల్లివిరిసింది. నాయకుల ఐక్యత, అధిష్ఠానం ఇచ్చిన కొండంత అండతో స్థానిక సమరంలో తిరుగులేని విజయం సాధిస్తామని శ్రేణులు ముక్తకంఠంతో చాటిచెప్పాయి.

?ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, జనసేన ప్రముఖ నేతలు యల్లటూరి శ్రీనివాసరాజు, అతికారి కృష్ణ, శివరామరాజు, తాతంశెట్టి నాగేంద్రతో పాటు పెద్ద సంఖ్యలో జనసైనికులు, వీరమహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలలో అభ్యున్నతికి పాటుపడండి

### ప్రశాంతంగా ముగిసిన పాఠశాలల కమిటీ ఎన్నికలు

ముద్దనూరు, సెప్టెంబర్ 29 మనంన్యూస్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి.. 36 ప్రాథమిక పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎన్నికలు మండల తహసిల్దార్ అలీ ఖాన్, మండల అభివృద్ధి అధికారిని రాధాకృష్ణ వేణి, ఆధ్వర్యంలో సిఐ నగేష్ బాబు ప్రతిష్ట బందోబస్తు తో పాఠశాలల కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర నాయక్ పేర్కొన్నారు. ప్రతి పాఠశాలకు ఒక ఎస్ ఎం సి చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు విద్యార్థుల సంఖ్యను బట్టి గరిష్టంగా 12 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎంసి కమిటీ కాలపరిమితి రెండు సంవత్సరాలు ఉంటుందని ఈ కాలంలో కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి వాటిని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. చైర్మన్లు వైస్ చైర్మన్, కమిటీ సభ్యులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో మరింత బలోపేతం కావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలోనే ఉన్నతమైన విద్య లభిస్తుందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు.

# సిద్ధవటం ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన చికిత్సలు

### డాక్టర్ బాలకొండ్రాయుడు




సిద్ధవటం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): సిద్ధవటం ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్య చికిత్స సేవలు అందుతున్నాయని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ బాలకొండ్రాయుడు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మండల కేంద్రమైన సిద్ధవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య శాలలో ఆయన మంగళవారం మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో పేషెంట్లకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో రోగులకు ఆపరేషన్లు జరుగుతున్నాయని ప్రవేట్ వైద్యశాల కెళ్ళి డబ్బులు వృధా చేసుకోవద్దని తెలిపారు మాచుపల్లి గ్రామానికి చెందిన సుబ్బ లక్ష్మమ్మ అనే మహిళ గత మూడు రోజులుగా ఫిస్టులా తో బాధపడుతూ ఉంటే ఆమెకు శస్త్ర చికిత్సలు చేశామన్నారు త్వరలో గైనకాలజిస్ట్ మహిళా వైద్యాధికారి డిప్యూటేషన్ పద్ధతిపై ఉన్నతాధికారులు నియామకం చేపడుతున్నారని తెలిపారు అట్లూరు ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాల తదితర గ్రామాల ప్రజలు ప్రవేట్ వైద్యశాల కి వెళ్లి డబ్బులు వృధా చేసుకోకుండా ప్రతి ఒక్కరూ కమ్యూనిటీ వైద్యశాలలో చికిత్స సేవలు వినియోగించుకోవాలన్నారు

# మితిల్ బాబు జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నప్రసాదం



సిద్ధవటం సెప్టెంబర్ 29(మనం న్యూస్): రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు తనయుడు సుగవాసి మితిల్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని మాధవరం పరిధిలోని శ్రీ కాశినాయన ఆశ్రమంలో వృద్ధులకు అన్నప్రసాదం కార్యక్రమాన్నిలి నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వృద్ధులకు అన్నప్రసాదంతో పాటు పండ్లు, బిస్కెట్లు, జ్యూస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వృద్ధుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో లిమన ఊరికోసం సేవ సంస్థ చైర్మన్ అవ్వరు రవిశంకర్, ఆశ్రమ నిర్వాహకులు మేరువ బాలాజీ, మాజీ వార్డు సభ్యులు సామల చెంగయ్య, సిద్దవటం మాజీ టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానంద, నియోజకవర్గ ఐటీడీపీ మాజీ ఉపాధ్యక్షులు నాగమునయ్యలితదితరులు పాల్గొన్నారు.

# రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో..



ముద్దనూరు,సెప్టెంబర్, 29, మనం న్యూస్ : మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా, డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి వెంకట క్రిష్ణారెడ్డి, మంగళవారం తెలిపారు. యూరియా బస్తా ధర రూ.266.50, డీఏపీ బస్తా ధర రూ.1,348గా ఉందన్నారు. ఏపీ ఎయిమ్స్ యాప్ ద్వారా పంటకు సిఫారసు చేసిన పరిమాణం మేరకు ఎరువులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. బొందలకుంట, ముద్ద నూరు, తిమ్మాపురం ఆర్‌బీకేల్లో యూరియా, ముద్దనూరు, శెట్టివారిపల్లె, కొలవలి ఆర్‌బీకేల్లో డీఏపీ అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# దేశంలోనే 'కడప' టాప్.. ఆకాంక్ష జిల్లాల్లో హ్యాట్రిక్ రికార్డు!

**వర్షాభావంపై సమరభేరి: 40 మండలాలు కరువు జాబితాకు ప్రతిపాదన**

**తాగునీరు, పశుగ్రాసానికి పెద్దపీట.. రైతులకు 35 శాతం రాయితీతో శనగ విత్తనాలు - సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి**







మనం ప్రతినిధి, కడప సెప్టెంబర్ 29: దేశవ్యాప్తంగా అమలవుతున్న ఆకాంక్ష జిల్లాల (ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్స్) కార్యక్రమంలో వైఎస్సార్ కడప జిల్లా సరికొత్త చరిత్ర సృష్టించింది. వరుసగా మూడు త్రైమాసికాల్లో జాతీయ స్థాయిలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుని ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా యంత్రాంగం సమష్టి కృషి వల్లే ఈ అరుదైన ఘనత సాధ్యమైందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత కొనియాడారు. మంగళవారం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రగతిని కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

**ఆకాంక్షలో అగ్రస్థానం.. స్మార్ట్ కిచెన్‌కు గుర్తింపు**

మార్చి 2026 నాటికి జిల్లా 80.06 కాంపోజిట్ స్కోర్‌ను నమోదు చేసి దేశంలోనే టాప్‌లో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించే లక్ష్యంతో ప్రారంభించిన 'స్మార్ట్ కిచెన్' కార్యక్రమానికి జాతీయ గుర్తింపు లభించిందన్నారు. ప్రస్తుతం 36 కేంద్రాలు పనిచేస్తుండగా, అక్టోబర్ 1 నాటికి వీటిని 38కి పెంచుతున్నామని, రోజుకు 73,698 మంది విద్యార్థులకు వేడి భోజనం అందుతోందని వివరించారు.

**తీవ్ర వర్షాభావం.. 40 కరువు మండలాలు**

ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సాధారణ వర్షపాతంలో 45.1 శాతం లోటు నమోదైందని సమావేశం దృష్టికి వచ్చింది. 40 మండలాల్లో 8 మండలాల్లో అత్యల్ప, 31 మండలాల్లో లోటు వర్షపాతం రికార్డైంది. జలాశయాల్లో 46.48 శాతం మాత్రమే నీరు నిల్వ ఉండటం, భూగర్భజలాలు పడిపోవడంతో క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా జిల్లాలోని మొత్తం 40 మండలాలను ఖరీఫ్-2026 కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

**రైతులకు రాయితీ విత్తనాలు.. తాగునీటికి తొలి ప్రాధాన్యం**

సాగు విస్తీర్ణం తగ్గడంతో ప్రత్యామ్నాయంగా ముందస్తు రబీ శనగ సాగును ప్రోత్సహిస్తున్నామని, 35 శాతం రాయితీతో 10,663 క్వింటాళ్ల విత్తనాలను రైతులకు అందిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. రిజర్వాయర్లలోని నీటిని తాగునీటి అవసరాలకే మొదటి ప్రాధాన్యంగా వాడతామని, పశువుల రక్షణ కోసం ముందస్తుగా పశు గ్రాస కేంద్రాలు, పశువుల శిబిరాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

**అభివృద్ధి పనుల వేగవంతం.. అవకతవకలపై కొరడా**

చెన్నూరు సీహెచ్‌సీని ప్రారంభించి తక్షణ వైద్య సేవలు అందించాలని, ప్రొద్దుటూరు ఏరియా ఆసుపత్రి, రావులకొలను-ఇనగలూరు రహదారి పనుల్లో అలసత్వాన్ని వీడాలని మంత్రి ఆదేశించారు. మైదుకూరు కస్టమ్ హైరింగ్ కేంద్రాలపై విజిలెన్స్ విచారణకు ఆదేశించామని, మార్కెట్ కమిటీ సెక్రటరీని సస్పెండ్ చేశామని అధికారులు తెలిపారు.

యువత కోసం 'స్టార్టప్ కడప', 'ఇన్వెస్ట్ కడప'ను ప్రోత్సహిస్తున్నామన్నారు. మదనపల్లెలో జరగనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రారంభోత్సవానికి జిల్లా నుంచి 3,000 మంది రైతులను ప్రత్యేక బస్సుల ద్వారా తరలించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని యంత్రాంగం స్పష్టం చేసింది.

# జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి





ప్రొద్దుటూరు సెప్టెంబర్ 29 మనం న్యూస్ : కడప జిల్లా సమగ్ర అభివృద్ధి,వివిధ ప్రభుత్వ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై మంగళవారం కడప కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన జిల్లా సమీక్షా కమిటీ సమావేశంలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో, రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీమతి ఎస్. సవిత గారి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు,వివిధ శాఖల ప్రగతి,ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలను సమావేశంలో వివరించారు. అనంతరం అజెండాలోని అంశాల వారీగా సంబంధిత శాఖల అధికారులు తమ శాఖల పరిధిలో సాధించిన ప్రగతి,చేపడుతున్న కార్యక్రమాలు,పనుల పురోగతిని ప్రజాప్రతినిధులకు వివరించారు. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి పనులు,ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు,సాగు మరియు తాగునీటి సమస్యలు,రహదారులు,విద్య, వైద్యం తదితర అంశాలకు సంబంధించి ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి అధికారుల దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లారు.నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టిన పనులను వేగవంతం చేయడంతో పాటు,పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు,అభివృద్ధి ఫలాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలపై సంబంధిత శాఖలు వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీమతి నిధిమీనా జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి రాష్ట్ర షేక్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఎం ముక్తియార్ అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుల హవా

**45 పాఠశాలల్లో అభ్యర్థులు ఏకగ్రీవం..**



ఒంటిమిట్ట, సెప్టెంబర్ 29 (మనం న్యూస్)

ఒంటిమిట్ట మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతు తెలిపిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని మొత్తం 45 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీల ఏర్పాటుకు ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా, టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్మోహన్‌రాజు ఆదేశాలు, సూచనల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందస్తుగా సమన్వయం చేసుకుని ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గ్రామాల వారీగా స్థానిక నాయకులతో చర్చలు జరిపి, పాఠశాలల వారీగా పరిస్థితులను సమన్వయం చేసుకుంటూ ఏకగ్రీవ ఎన్నికలకు కృషి చేసినట్లు పేర్కొన్నారు. మండలంలోని 45 పాఠశాలల్లోనూ పార్టీ మద్దతుదారుల మధ్య సమన్వయం సాధించడం ద్వారా పోటీ లేకుండా కమిటీలు ఏర్పడేలా చర్యలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. జగన్మోహన్‌రాజు ఇచ్చిన దిశానిర్దేశంతో స్థానిక నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి.

**కీలకంగా వ్యవహరించిన నాయకులు**

ఎస్ఎంసీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారుల ఏకగ్రీవ ఎన్నికకు గజ్జల నరసింహారెడ్డి, కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, ఎస్.వి. రమణ, సాలాబాద్ బుజ్జి, తుమ్మలకుంట ఈశ్వరయ్య, ముద్దుకృష్ణారెడ్డి , చింతరాజుపల్లి రమణ, గజ్జల శ్రీనివాసులు రెడ్డి, నల్లగొండు వెంకట సుబ్బారెడ్డి తదితరులు కీలకపాత్ర పోషించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఆయా గ్రామాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలు విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల మౌలిక వసతులు, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల మధ్య సమన్వయం వంటి అంశాల్లో కీలకంగా పనిచేస్తాయని పార్టీ నాయకులు తెలిపారు. కొత్తగా ఏర్పడిన కమిటీలు పాఠశాలల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని వారు ఆకాంక్షించారు.

45 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీలు ఏకగ్రీవంగా ఏర్పడటంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన సూచనలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ స్థానిక నాయకులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఏకగ్రీవ ఎన్నికలు సాధ్యమయ్యాయని వారు పేర్కొన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోట చేసుకోకుండా ఎలక్షన్లో ప్రశాంతంగా జరిగేలా సీ ఐ వెంకటేశ్వర్లు, ఎస్ ఐ శ్రీనివాసులు బందోబస్తు ను ఏర్పాటు చేశారు.

# మండలంలో ప్రశాంతంగా ఎస్ఎంసి కమిటీ ఎన్నికలు





చిట్వేలి సెప్టెంబర్ 29 మనం న్యూస్: ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎస్ఎంసి పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు మంగళవారం చిట్వేలి మండల వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని మొత్తం 61 పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఇందులో 55 ప్రాథమిక పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉన్నాయి. అర్హులైన తల్లిదండ్రులు పాల్గొని ఆయా పాఠశాల చైర్మన్ల ను ఎన్నుకున్నారు. కాగా చిట్వేలి ఉన్నత పాఠశాల నుంచి ఎస్ఎంసి కమిటీకి జరిగిన ఎన్నికలలో చైర్మన్ గా జడపోలు శివప్రసాద్ గౌడ్, వైస్ చైర్మన్ గా చనపోలు చెంచులక్ష్మి ఎంపికయ్యారు. కందులవారిపల్లి ఉన్నత పాఠశాల చైర్మన్ గా జి.సునీత, కస్తూర్బా స్కూల్ చైర్మన్‌గా పెంచలమ్మ, జడ్పీహెచ్ఎస్ నాగవరం చైర్మన్‌గా జయప్రసాద్ రాజు, జడ్పీ.హెచ్ఎస్ పోల్లపల్లి చైర్మన్‌గా కె.ప్రసాద్ లు ఎన్నికయ్యారు. స్థానిక ఉన్నత పాఠశాల చైర్మన్ గా ఎంపికైన శివప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.నాకు అవకాశం ఇచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులకు, స్థానిక కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు కాజా మొహిద్దిన్, ఈశ్వరయ్యలు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఉపాధ్యాయులు, సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కాకర్ల నాగార్జున, వైస్ ప్రెసిడెంట్ కొండా వెంకటేష్, మాజీ చైర్మన్ శంకర్ రాజు, కూటమి నాయకులు బుంగటావుల రాజశేఖర్, తుంగ నవీన్, ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, సీనియర్ ఉపాధ్యాయులు సోఫియా, పసుపుల రాజశేఖర్, తిరుమల విశ్వనాథం, పురుషోత్తం, చంద్ర, కళావతి, సుహాసిని, శిల్పకళ, ఈశ్వరయ్య, గీతారాణి, చెన్నయ్య, వెంకటేష్, మండల పాఠశాలలోని పిల్లల తల్లిదండ్రులు, పలువురు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాజంపేట మున్సిపాలిటీ టీడీపీ అభ్యర్థిగా పోటీకి సిద్ధం: డాక్టర్ నవీన్ కుమార్






రాజంపేట మనం ప్రతినిధి సెప్టెంబర్ 29 :రాజంపేట నియోజకవర్గంలో గత 20 సంవత్సరాలుగా వైద్యుడిగా ప్రజలకు సేవనందిస్తూ, తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్న కుటుంబానికి చెందిన డాక్టర్ నవీన్ కుమార్.. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో రాజంపేట మున్సిపాలిటీ టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు ఆసక్తి కనబరిచారు. ఈనేపథ్యంలో, మంగళవారం కడపలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలు దీపక్ రెడ్డిని మరియు భూపేష్ రెడ్డిని డాక్టర్ నవీన్ కుమార్ మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా రాజంపేట మున్సి పాలిటీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పిస్తే, పార్టీ విజయానికి శ్రమిస్తానని మరియు అత్యంత భారీ మెజారిటీతో గెలిపించి పార్టీ అధిష్టానం నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని వారు తెలిపారు. పార్టీ అవకాశం కల్పిస్తే స్థానిక ప్రజల మద్దతుతో మున్సిపాలిటీని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవీన్ కుమార్‌తో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సి. సుధాకర్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ సుబ్రహ్మణ్యం నాయుడు, రూరల్ ప్రెసిడెంట్ రవి నాయుడు, లక్ష్మీనారాయణ, సంజీవరావు, వెంకటేష్, మైనారిటీ నాయకులు గుల్జార్ భాష, వెంకటేశ్వర్లు, శివ నారాయణ చౌదరి, మని బాబు, అంజి బాబు, హరి నరసింహ, దివాకర్, ఉదయ్, బాలాజీ పాల్గొన్నారు.

# బిజెపి నేతల చేతుల మీదుగా లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఓబులవారిపల్లి, సెప్టెంబర్ 29, మనం న్యూస్ తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబుళవారిపల్లి మండలంలో మంగళవారం నాడు బిజెపి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబులవారిపల్లి మండల బీజేపీ అధ్యక్షులు ముక్కా రూపేష్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు బాధితులకు ఈ ఆర్థిక సాయం అందజేశారు. కోర్లకుంట గ్రామ పంచాయతీకి చెందిన గుడ్ల వెంకట లక్ష్మమ్మకు



రూ.31,201, గుండ్లూరు లక్ష్మికి రూ.32,500, అలాగే చల్లంపాలెం గ్రామానికి చెందిన తాటిగొట్ల ప్రసాద్ రాజుకు రూ.32,100 విలువగల సీఎమ్ఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఆర్థికంగా చేయూతనందించిన రాష్ట్ర ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పి.మాధవ్ లకు రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రికి, రాష్ట్ర ఖాదీ బోర్డు చైర్మన్‌కు, నియోజకవర్గ ఇంచార్జికి మరియు స్థానిక శాసనసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులు, వివిధ మోర్చాల ప్రతినిధులు మరియు పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా ఆంధ్ర విజ్ఞాన సమ్మేళనం

సిద్ధవటం సెప్టెంబర్ 29(మనం న్యూస్) విజయవాడ ప్రణాళికలు మరియు వాస్తు శిల్ప విద్యాలయంలో భారత ప్రభుత్వం ఉన్నత విద్యాశాఖ భారతీయ భాషా సమితి మరియు విజ్ఞాన భారతి సంయుక్త నిర్వహణలో జరిగిన ఆంధ్ర విజ్ఞాన సమ్మేళనంలో రెండోవ రోజు కార్యక్రమంలో దేవి భాగవతం వన సంరక్షణ అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించినట్లు విద్వాన్ నాగదాసరి మునికుమార్ తెలిపారు.దేవీ భాగవతంలో చెప్పినటువంటి తాటి వనం మరియు పంచవనాలైన సంతాన వనం, నందన వనం, చైత్రరథ వనం, వైభ్రాజ వనం సర్వతో భద్ర వనం అనే ఐదు వనాల విశిష్టతను వివరించారు.



# సీమకు హార్టికల్చర్ కిరీటం.. కడపలో వినూత్న ప్రచార విన్యాసం!

## ఆధునిక సాంకేతికతతో రైతాంగానికి మేలుకొలుపు

## రేపే మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్'కు సీఎం శ్రీకారం



మనం ప్రతినిధి కడప, సెప్టెంబరు 29కరవు నేలగా ముద్రపడ్డ రాయలసీమను అంతర్జాతీయ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన 'రాయలసీమ రైజింగ్' ప్రచారం సరికొత్త పుంతలు తొక్కింది. అక్టోబరు 2న మదనపల్లె వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మెగా ప్రాజెక్టును పట్టాలెక్కించనున్న నేపథ్యంలో, కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం మంగళవారం రాత్రి వినూత్న సాంకేతిక విన్యాసాలకు వేదికైంది. సమాచార పౌరసంబంధాల శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గగనతలంలో నిర్వహించిన డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన ద్వారా 'రాయలసీమ రైజింగ్ - గ్లోబల్ హార్టికల్చర్ హబ్' లోగోను, సందేశాన్ని వెలుగుల రూపంలో కనువిందుగా ఆవిష్కరించారు. రైతును కేవలం సాగుదారుడిగానే కాకుండా ఆధునిక పద్ధతులతో ఉద్యాన పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దడమే ఈ ప్రాజెక్టు అసలు లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. అధునాతన సాంకేతికత, అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో యువతకు ఉపాధి కల్పించే బృహత్తర ప్రణాళికను ఈ వినూత్న ప్రదర్శన ద్వారా ప్రజలకు చాటిచెప్పారు. ప్రాజెక్టు లక్ష్యాలను ఊరూరా వివరించేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ముమ్మర ప్రచారం చేపడుతున్నట్లు వెల్లడించారు.



# ఎలిమెంటరీ పాఠశాల కమిటీ చైర్మన్‌గా మందా శ్రీనివాసులు ఎన్నిక

రాజంపేట మనం న్యూస్ సెప్టెంబర్ 29: కడప జిల్లా, రాజంపేట పట్టణం, 22వ వార్డు మన్నూరు అరుంధతివాడ వీఖ్యా ఎలిమెంటరీ స్కూల్ చైర్మన్‌గా ఎన్నికైన మందా శ్రీనివాసులు.స్థానిక ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాల కమిటీ నూతన చైర్మన్‌గా మందా శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హెడ్ టీచర్ బాల చౌడేశ్వరి మేడమ్ గారి అధ్యక్షతన జరిగిన ఈ పాఠశాల కమిటీ సమావేశంలో నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. తనను చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు గ్రామాభివృద్ధికి, పాఠశాల పురోగతికి సహకరించిన గ్రామస్తులకు, ఎలక్టోరల్ ఓటర్లకు, ఉపాధ్యాయులకు మందా శ్రీనివాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర విద్యా శాఖ మరియు ఐటీ, కమ్యూనికేషన్ల శాఖామంత్రి నారా లోకేష్ బాబు గారు రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, పిల్లల చదువుల కోసం వందల కోట్ల రూపాయలు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో త్వరలోనే మంత్రి నారా లోకేష్ బాబుని కలిసి, పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు తెప్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణం, కాంపౌండ్ వాల్, మరుగుదొడ్ల నిర్మాణం మరియు ఇతర మౌలిక వసతులు కల్పించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఆయన స్పష్టం చేశారు.

# కీర్తిశేషులు కొల్లం బ్రహ్మానంద రెడ్డికి ఘన నివాళు లర్పించిన మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



రైల్వే కోడూరు, సెప్టెంబర్ 29, మనం న్యూస్ : రైల్వే కోడూరు నియోజకవర్గ మాజీ ఇంచార్జ్, కీర్తిశేషులు దివంగత కొల్లం బ్రహ్మానంద రెడ్డి 9వ వర్ధంతి వేడుకలను మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కోడూరు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని బ్రహ్మానంద రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కొల్లం బ్రహ్మానంద రెడ్డి నియోజకవర్గ ప్రజలకు, పార్టీకి అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ నివాళి కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు మాదినేని వెంకట్ రెడ్డి, సి డి నాగేంద్ర,పట్టణ అధ్యక్షులు సిహెచ్ రమేష్,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి: మందల నాగేంద్ర,రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రత్నమ్మ, ఆంజనేయులు, పర్వతం విజయ్ కుమార్ రెడ్డి, అంబటి మురళి ,నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షులు ప్రభాకర్ యాదవ్,జిల్లా అధికార ప్రతినిధి పదవల వెంకటరమణ, పార్టీ నాయకులు రాజగోపాల్, కరీముల్లా, ఉమామహేశ్వర్ రెడ్డి, శారదమ్మ ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఓట్ల యంత్రాల గిడ్డంగి వద్ద నిరంతరం కట్టుదిట్టమైన కావలి ఉండాలి

## జిల్లా పాలనాధికారి నిశాంత్ కుమార్

## రాజకీయ పక్షాల సమక్షంలో రాయచోటి అంగడి ప్రాంగణంలోని గిడ్డంగి పరిశీలన

మనంన్యూస్ రాయచోటి సెప్టెంబర్ 29: జిల్లాకు సంబంధించిన ఓట్ల యంత్రాలను భద్రపరచిన గిడ్డంగి వద్ద నిరంతరం, రేయింబవళ్లు కట్టుదిట్టమైన కావలి, పటిష్టమైన నిఘా ఉండాలని జిల్లా పాలనాధికారి నిశాంత్ కుమార్ అధికారులను ఆజ్ఞాపించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం రాయచోటి పట్టణం అంగడి ప్రాంగణంలో ఉన్న ఓట్ల యంత్రాల గిడ్డంగిని వివిధ రాజకీయ పక్షాల నాయకులతో కలిసి జిల్లా పాలనాధికారి పరిశీలించారు. గిడ్డంగి లోపల దాచిన ఓటు నమోదు యంత్రాలు, నియంత్రణ యంత్రాలు, రసీదు యంత్రాలను, అక్కడి రక్షణ ఏర్పాట్లను స్వయంగా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఈ విషయమై రాజకీయ పక్షాల ప్రతినిధులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాయచోటి తాలూకా అధికారిణి యామిని, జిల్లా పాలనా విభాగపు ఎన్నికల పర్యవేక్షకులు, సిబ్బంది, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## టక్కోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నిక

సిద్దవటం సెప్టెంబర్ 29(మనం న్యూస్) టక్కోలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యా కమిటీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో టక్కోలి జెడ్పీహెచ్ఎస్ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ఛైర్మన్ దుంపల వెంకట సుబ్బమ్మ, బీసీ కాలనీ స్కూల్ ఛైర్మన్‌గా గంగారపు మహాలక్ష్మి ఎన్నికయ్యారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి నూతనంగా ఎన్నికైన ఛైర్మన్, సభ్యులు ఎంతగానో కృషి చేయాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యా ప్రమాణాల పెంపునకు నిరంతరం శ్రమించాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**మధ్యాహ్న భోజన పథకం పరిశీలన:**

ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని నాయకులు పరిశీలించారు. అనంతరం నాయకులు అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఎంతో నాణ్యమైన, పౌష్టికాహారాన్ని అందిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగముని రెడ్డి, అండ్లూరి చిన్నపరెడ్డి, శంకర్, బూత్ కన్వీనర్ చంద్రాఓబుల్ రెడ్డి,తదితర నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## స్వర్గీయ కొల్లం బ్రహ్మానంద రెడ్డి వర్ధంతి

### రాష్ట్ర స్థాయి కబడ్డీ క్రీడాకారులకు రూ. 15,000 ఆర్థిక సాయం అందించిన రామిరెడ్డి ధ్వజారెడ్డి



రైల్వే కోడూరు,సెప్టెంబర్ 29, మనం న్యూస్ : స్వర్గీయ కొల్లం బ్రహ్మానంద రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం రైల్వే కోడూరులోని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పురుషుల, మహిళల జట్లకు రూ.15,000 ల ఆర్థిక సహాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ ఆర్థిక సాయాన్ని వైసీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు తోట శివసాయి, కొరెడ్డి సిద్దయ్య యాదవ్ కలిసి క్రీడాకారులకు అందజేసి వారిని అభినందించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి కోడూరు ప్రాంతానికి మంచి పేరు తీసకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కబడ్డీ అసోసియేషన్ సభ్యురాలు అరుణ, ఓబులరెడ్డిలతో పాటు మాజీ సర్పంచులు హరికృష్ణా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, దార్ల చంద్రశేఖర్ రావు, ఆర్.వి. రమణ, కొన్నిపాటి ప్రసాద్, సుబ్రమణ్యం రాజు, చెంగల్ రెడ్డి, గోపి, రమణయ్య, కృష్ణ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొంటారు. అలాగే మాజీ ఎంపీటీసీ ఆనంద్ యాదవ్, నాయకులు ప్రసాద్, షఫీ, రెడ్డయ్య రెడ్డి, కుంచం హరి, మణి, నాగరాజు, వెంకటేష్ మరియు ఇతర పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు.

## బీఈడీలో 83.82%, ఎంఈడీలో 34.38% ఉత్తీర్ణత

### వైవీయూ ఫలితాలు వెల్లడి

మనం న్యూస్ కడప సెప్టెంబర్ 29: యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన బీఈడీ, ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షా ఫలితాలు అధికారికంగా విడుదలయ్యాయి. వీసీ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఈ ఫలితాల వివరాలను ప్రకటించారు. ఈ పరీక్షల్లో బీఈడీ విద్యార్థులు 83.82 శాతం ఉత్తీర్ణతతో మెరుగైన ప్రతిభ కనబరచగా, ఎంఈడీలో 34.38 శాతం మంది మాత్రమే పాసయ్యారని ఆయన పేర్కొన్నారు. సాంకేతికతను జోడిస్తూ విద్యార్థులు ఫలితాలను సులభంగా తెలుసుకునేందుకు విశ్వవిద్యాలయం వాట్సాప్ సేవలను కూడా అందుబాటులోకి తెచ్చింది; విద్యార్థులు 9552300009 నంబర్ ద్వారా వివరాలు పొందవచ్చని అధికారులు సూచించారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎ.జి. దాము, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి, సీఈ ఆచార్య టి. లక్ష్మీ ప్రసాద్ తదితర విద్యావేత్తలు, అధికారులు పాల్గొన్నారు.







## మతసామరస్యానికి ప్రతీకలు ఉరుసు మహోత్సవాలు

### అన్ని మతాల ప్రజలను ఏకం చేసే ఆధ్యాత్మిక వేడుకలు - యల్లటూరు శ్రీనివాసరాజు

నందలూరు మనం న్యూస్ సెప్టెంబర్ 29 మతసామరస్యానికి, సోదరభావానికి ఉరుసు మహోత్సవాలు ప్రతీకలుగా నిలుస్తాయని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం రాత్రి నందలూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన జండామాను ఉరుసు మహోత్సవాల్లో యల్లటూరు శ్రీనివాసరాజు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉరుసు మహోత్సవాలు కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ప్రజల మధ్య సోదరభావం, పరస్పర గౌరవం, మతసామరస్యాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తున్నాయని అన్నారు. అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ ఐకమత్యంతో ముందుకు సాగినప్పుడే సమాజంలో శాంతి, సామరస్యం మరింత బలపడతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి మేజర్



గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ ఎంపీటీసీ మాడపూరి శ్రీరాములు, సయ్యద్ జుల్ఫికర్, సయ్యద్ అమీర్ మరియు ఉరుసు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనంతరాజుపేటలో ఘనంగా పాఠశాల కమిటీల ఎన్నిక





రైల్వే కోడూరు రూరల్, సెప్టెంబర్ 29, మనం న్యూస్ స్థానిక విద్యాలయాల్లో విద్యాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు బాటలు వేస్తూ అనంతరాజుపేట గ్రామంలో పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలను మంగళవారం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. అందరి ఆమోదయోగ్యంతో, ఏకాభిప్రాయంతో జరిగిన ఈ ఎన్నికల్లో జడ్పీ హైస్కూల్ మరియు ఎంపీపీ ప్రైమరీ పాఠశాలలకు నూతన ఛైర్మన్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరాజుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ నూతన ఛైర్మన్‌గా గంగరపు చెన్నరాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మరియు కమిటీ సభ్యులందరి ఆమోదంతో ఆయనను ఈ పదవికి ఎన్నుకోవడం జరిగింది. ఎన్నిక అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా చెన్నరాయుడు తెలిపారు. అలాగే గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసి ఛైర్మన్‌గా శ్రీమతి సింగిరి మల్లికను అందరి ఏకాభిప్రాయంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారిని గ్రామ ప్రముఖులు, కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, పాఠశాలల ఉపాధ్యాయ బృందం, పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు విశేష సంఖ్యలో పాల్గొని నూతన ఛైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాలల ప్రగతికి, విద్యార్థుల బాటగుడికి అంతా కలిసికట్టుగా కృషి చేయాలని ఈ సందర్భంగా తీర్మానించారు.

## భాకరాపేట జడ్పీ హైస్కూల్ యస్ యం సీ ఛైర్మన్ గా వంకర సౌజన్య,వైస్ ఛైర్మన్‌గా సొంటా రామయ్య

సిద్ధవటం సెప్టెంబర్ 29(మనం న్యూస్) భాకరాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిద్ధవటం మండల యంఈఓ ఆవుల అరుణ ఆదేశాల మేరకు ప్రధానోపాధ్యాయు రాలు లక్ష్మి కేసమ్మ గారి అధ్యక్షతన జరిగినటువంటి స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికల్లో రాజంపేట





పార్లమెంట్ టిడిపి మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య, టిడిపి అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు ఆధ్వర్యంలో వంకర సౌజన్య చైర్ పర్సన్‌గా,సొంటా రామయ్య వైస్ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల పీడి రామచంద్ర, తల్లితండ్రులు, విద్యార్థులు, యువ న్యాయవాది శ్రీరామ్ బాలచంద్ర,మాజీ విద్యాకమిటీ ఛైర్మన్లు కాడే రెడ్డయ్య,బాలినేని రవి కుమార్, టిడిపి మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు వంకర సుబ్బయ్య, గ్రామస్థులు ,స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఆసియా క్రీడలు: షూటింగ్‌లో నీరూ దండాకు స్వర్ణం..

ఐచీ-నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భారత షూటర్ నీరూ దండా అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఏకాగ్రత కోల్పోకుండా అద్భుతంగా గురిపెట్టిన నీరూ, మహిళల ట్రాప్ షూటింగ్ వ్యక్తిగత విభాగంలో పసిడి పతకాన్ని ముద్దాడారు. ఈ క్రీడల్లో భారత్‌కు ఇది ఐదో స్వర్ణం కాగా, షూటింగ్‌లో వ్యక్తిగత విభాగంలో ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. పదవ రోజు పోటీల్లో భాగంగా నీరూ అద్భుత ప్రదర్శనతో పాటు మహిళల ట్రాప్ జట్టు రజత పతకాన్ని సాధించి సత్తా చాటింది. అయితే, పురుషుల ట్రాప్ జట్టు పతకాన్ని త్రుటిలో చేజార్చుకుంది. పురుషుల జట్టులో షపత్ భరద్వాజ్ వ్యక్తిగత ఫైనల్‌కు అర్హత సాధించి ఆశలు రేకెత్తించాడు.

## వంగిమల్లలో కల్లూరి ఆధ్వర్యంలో పాఠశాల ఎన్నికల ఏకగ్రీవం

### ఉప్పరపల్లి జడ్పీ పాఠశాలలో భారీగా ఓట్లతో నెగ్గిన వైనం

### సహకరించిన గంగనేరు, వంగిమళ్ళ, దిగివరాచపల్లి తెదేపా నాయకులకు కృతజ్ఞతలు

వీరబల్లి మనంన్యూస్ సెప్టెంబర్ 29: మంగిమల్ల పంచాయతీలోని పాఠశాలల్లో మంగళవారం జరిగిన పాఠశాల కమిటీ ఎన్నికలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ వీరబల్లి సొసైటీ అధ్యక్షులు కల్లూరి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్లు, వైస్ చైర్మన్ లను ఏకగ్రీవంగా తెలుగుదేశం పార్టీ చెందిన వారిని ఎన్నుకోవడం జరిగింది. ఉప్పరపల్లి జెడ్పీ పాఠశాలలో నెల కొన్నా పోటీలో మెజారిటీ ఓట్లు ఉండంతో పోటీవర్గం వెళ్లిపోవడం తో చైర్మన్, వైస్ చైర్మన్ లను , సభ్యులను అందరిని తెలుగుదేశం పార్టీకి చెందిన వారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. తెలుగుదేశం పార్టీ సభ్యుల గెలుపునకు కృషిచేసిన అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

